ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

తమిళనాడు

TAMILNADU

ఆదివారం 11 ఆగస్టు 2024



రాష్ట్రానికి మూడు రోజులు

భారీ వర్ష సూచన



అడయార్, ఆగస్టు 10: రాష్ట్రానికి ఈ నెల 13వ తేదీ వరకు భారీ వర్ష సూచన ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. నైరుతి రుతుపవన సీజన్ ప్రాంభంకావడంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్న విషయం తెల్సిందే. దీనికితోడు వాతావరణంలో మార్పుల కారణంగా బంగాళాఖాతంలో అల్పపీడనాలు, వాయుగుండాలు ఏర్పాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 13వ తేదీ వరకు అనేక ప్రాంతాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. గల్ఫ్ ఆఫ్ మన్నార్, దక్షిణ తమిళనాడు కోస్తాతీర ప్రాంతాలు, కుమరి సముద్రతీర ప్రాంతంలో గంటకు 35 నుంచి 45 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. ఆదివారం కొండ ప్రాంత జిల్లాలైన నీలగిరి, కోయంబత్తూరు, దిండిగల్, తేని, తెన్‌కాశి, తిరునెల్వేలి, మదురై, కన్నియకుమారి, శివగంగై, రామనాథపురం, తూత్తుక్కుడి, పుదుకోట, తంజావూరు జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. అలాగే, సోమవారం కోవై, నెల్లై, నీలగిరి, తిరుపూరు, తేని, దిండిగల్, సేలం, నామక్కల్, కరూర్, తిరుచ్చి, అరియలూరు, పెరంబలూరు, తంజావూరు, పుదుక్కోట, కన్నియాకుమారి, మదురై జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే, చెన్నైతో పాటు నగర పరిసర ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని పేర్కొంది.

ఉన్నవారికి గౌరవం లేదు..

కొత్తవారికి తావు లేదు!

సెల్వపెరుంతగై సమక్షంలో టీఎన్‌సీసీ నేతల ఆవేదన



చెన్నై, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పార్టీకి దశాబ్దాల తరబడి సేవలందిస్తున్నవారికి అధిష్ఠానం నుంచి ఏమాత్రం గౌరవ భావాలే లేవని, అలాంటప్పుడు కొత్తవారికి సభ్యత్వం ఎలా కల్పించగలమంటూ టీఎన్‌సీసీ సీనియర్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎగ్మూరులో సౌత్ చెన్నై, వెస్ట్ చెన్నై పార్టీ నాయకుల సమావేశం టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు ఎస్.తిరునావుక్కరసర్, మాజీ ఎంపీ ఆరూన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పార్టీ సభ్యత్వంపై జరిగిన చర్చలో సీనియర్ నేతలు అధిష్ఠానంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో డీఎంకే కూటమిలో అణగిమణగి ఉంటూ ఎన్నికల సమయాల్లో ఏవో కొన్ని సీట్లను గెలుచుకుని మిన్నకుండి పోతున్నారని, ఏనాడూ పార్టీని అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టడం లేదని పార్టీ స్థానిక నేతలు మండిపడ్డారు. పార్టీలో చేర్పించడానికి సభ్యులను తీసుకొచ్చే సత్తా తమకు ఉందని, అయితే పార్టీలో దశాబ్దాల తరబడి సేవలు చేస్తున్నవారికే ఎలాంటి పదవులు లేవని, వారిని పార్టీ పెద్దలు గౌరవించడం కూడా లేదని, అలాంటప్పుడు కొత్తవారు ఎలాంటి ఆశలు పెట్టుకుని సభ్యత్వం స్వీకరించగలరని ప్రశ్నించారు. జిల్లాస్థాయి నాయకుడు ఎస్ఎం కుమార్ మాట్లాడుతూ... సొంతబలంతో పార్టీ ఎదిగితేనే కొత్తవారు సభ్యులుగా చేరుతారని, అయితే యేళ్ల తరబడి ద్రావిడ పార్టీల కూటమిలోనే కొనసాగుతూ పార్టీ అభివృద్ధిని పూర్తిగా విస్మరించటం భావ్యమేనా అని ప్రశ్నించారు. ప్రస్తుతం పార్టీని అభివృద్ధి చేసేందుకు టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై పటిష్ఠ చర్యలు చేపట్టాలని కోరారు. ఇటీవల జరిగిన పార్టీ సర్వ సభ్య మండలి సమావేశం రాష్ట్రంలో పార్టీ ఎదుగుదలకు చేపట్టాల్సిన చర్యలపై ఎలాంటి చర్చలు జరపకుండా ముగిసిందన్నారు. ఇక ఎస్సీ విభాగ నేత రంజన్‌కుమార్ మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఏ దిశగా పయనిస్తోందో స్పష్టంగా చెప్పగలరా? అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో కామరాజర్ పాలన ఏర్పాటు చేస్తామంటూ గొప్పలు చెప్పటం మినహా ఆ దిశగా పార్టీ నేతలు గానీ, అధిష్ఠానం గానీ ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. పార్టీ ఓటు బ్యాంక్ 40 శాతం దాకా తగ్గినట్లు చెబుతున్నారని, దానికి కారణాలేమిటన్నారు. పార్టీ కోసం ఐదు దశాబ్దాలకు పైబడి సేవలందించినవారంతా ఎలాంటి పదవులు లేకుండా సాదాసీదాగా గడుపుతున్నారని, ఇలాంటి దయనీయ స్థితి ఏ పార్టీలో లేదన్నారు. పార్టీలో సభ్యత్వం పొందటానికి వేల సంఖ్యలో యువకులు సిద్ధంగా ఉన్నారని, అయితే అలా చేరిన సభ్యులకు పార్టీ ఎలాంటి పదవులు ఇస్తుందో స్పష్టం చేయాలని మరికొంతమంది నాయకులు పట్టుబట్టారు. ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా గెలిచినవారంతా ఆ పదవులను అనుభవించడం మినహా పార్టీ అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో ఉన్నవారికే గౌరవ మర్యాదలు లేనప్పుడు కొత్తవారికి తావు ఎలా ఉంటుందని ప్రశ్నించారు. పార్టీ స్వీయశక్తితో ఎదిగినప్పుడే సభ్యత్వ కార్యక్రమాలు విజయవంతం అవుతాయని, లేకుంటే కొత్తవారిని పార్టీలో చేర్పించటం కష్టసాధ్యమన్నారు. ఇలా పార్టీ నిర్వాహకుల అభిప్రాయాలను ఓపికగా విన్న సెల్వపెరుంతగై... ఈ విషయాలన్నీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి పాటుపడతానంటూ సభికుల హర్షధ్వానాల నడుమ శపథం చేశారు.

గంజాయి స్మగ్లింగ్‌ను

నిరోధించండి!



ఆంధ్ర, అసోం ప్రభుత్వాలకు డీజీపీ లేఖ

చెన్నై, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ఆంధ్రప్రదేశ్, అసోం రాష్ట్రాల నుంచి విచ్చలవిడిగా గంజాయి రాష్ట్రానికి తరలుతోందని డీజీపీ శంకర్‌జివాల్ చెప్పారు. ఈ మేరకు ఆ రెండు రాష్ట్రాలకు ఆయన ఓ లేఖ రాశారు. తమిళనాడులోకి స్మగ్లర్లు గంజాయిని అక్రమంగా రవాణా చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని రెండు రాష్ట్రాలకు విజ్ఞప్తి చేశారు. జాతీయస్థాయిలో గంజాయి వినియోగం అధికంగా ఉన్న రాష్ట్రాల్లో తమిళనాడు 35వ స్థానంలో ఉందని, దేశవ్యాప్తంగా చట్టవ్యతిరేకంగా తరలిస్తున్న గంజాయిలో 0.1 శాతం గంజాయి తమిళనాట పంపిణీ అవుతోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో రోజురోజుకు గంజాయి వినియోగం అధికమవుతోందని, కరోనా లాక్‌డౌన్ తర్వాత ఇతర రాష్ట్రాల నుంచి గంజాయిని అధికంగా తరలిస్తున్నారన్నారు. రాష్ట్రంలో గంజాయి పెంపకాన్ని నిరోధించగలిగామని, అదే విధంగా గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునేందుకు తాము పటిష్ఠ చర్యలు తీసుకున్నప్పటికీ ఆంధ్రప్రదేశ్, అసోం రాష్ట్రాల నుండి అడ్డూఅదుపూలేకుండా అక్రమంగా రవాణా చేయడం వల్ల యువకులు గంజాయికి బానిసలవుతున్నారని డీజీపీ పేర్కొన్నారు. తాము చేపట్టిన చర్యల కారణంగా గత 2022లో రాష్ట్ర వ్యాప్తంగా 28,383 కిలోలు, 2023లో 23,364 కిలోలు, ఈ యేడాది జూన్ వరకు 11,081 కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. అంతే కాకుండా మాదకద్రవ్యాల నిరోధక చట్టం కింద గత 2021-24 మధ్య 4,504 వాహనాలు కూడా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

2వేలకు పైగా అరెస్టులు..

రాష్ట్రంలో గంజాయి తరలిస్తూ, విక్రయిస్తూ ఇతర రాష్ట్రాలకు చెందిన స్మగ్లరు రెండువేలమందికి పైగా అరెస్టయ్యారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, అసోం, త్రిపుర, బిహార్ రాష్ట్రాల నుంచి 80 శాతం గంజాయి రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్నట్లు తమ తనిఖీలు, పరిశీలనల ద్వారా నిర్ధారణ అయ్యిందన్నారు. గంజాయి స్మగ్లింగ్, అమ్మకం కేసులలో ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఒడిశా, తెలంగాణ, అసోం, త్రిపుర తదితర రాష్ట్రాలకు చెందిన 2,486 మందిని అరెస్టు చేసినట్లు ఆయన వివరించారు. అదే కాకుండా ఆ రాష్ట్రాల నుండి వచ్చే కార్మికులు, పర్యాటకులు తదితరులపై పోలీసులు రైల్వేస్టేషన్లు, విమానాశ్రయలలో తీవ్రంగా నిఘా వేస్తున్నారని చెప్పారు. ఈ రాష్ట్రాల నుంచి వచ్చే మినీ లారీలు, లారీలు, కంటైనర్ లారీలను క్షుణ్ణంగా తనిఖీ చేసినమీదటే తమ రాష్ట్రంలోకి అనుమతిస్తున్నట్లు తెలిపారు. ఈ పరిస్థితులలోనే ఆంధ్రప్రదేశ్, అసోం ప్రభుత్వాలు తమిళనాట గంజాయి అక్రమ రవాణా కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని, స్మగ్లర్లకు సంబంధించిన సమాచారాలను ఎప్పటికప్పుడు తమకందించి సహకరించాలని డీజీపీ శంకర్ జివాల్ ఆ లేఖలో కోరారు.

మాజీ ఐజీ పొన్‌మాణిక్కవేల్ నివాసంలో

సీబీఐ తనిఖీలు



చెన్నై, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విగ్రహాల అక్రమ రవాణా నిరోధక విభాగం మాజీ ఐజీ పొన్‌మాణిక్కవేల్ నివాసంలో సీబీఐ అధికారులు శనివారం ఉదయం ఆకస్మిక తనిఖీలు జరిపారు. పొన్ మాణిక్కవేల్ విగ్రహాల అక్రమ రవాణా నిరోధక విభాగంలో పనిచేస్తున్నప్పుడు విగ్రహాల స్మగ్లర్లతో కుమ్మక్కయి, వారికి అనుకూలంగా పని చేశారంటూ ఆ విభాగంలోనే పని చేస్తూ సస్పెన్షన్‌కు గురైన బాషా... మద్రాసు హైకోర్టులో 2018లో పిటిషన్ దాఖలు చేశారు. దానిపై విచారణ జరిపిన హైకోర్టు సీబీఐ విచారణకు ఉత్తర్వు జారీ చేసింది. ఆ మేరకు 2023లో సీబీఐ దాఖలు చేసిన కేసు విచారణలో భాగంగా శనివారం ఉదయం స్థానిక పాలవాక్కంలో ఉన్న పొన్‌మాణిక్కవేల్ నివాసంలో సీబీఐ అధికారులు తనిఖీలు జరిపారు. కేసుకు సంబంధించి ఆయన వద్ద విచారణ చేపట్టారు. కాగా, విగ్రహాల అక్రమ రవాణా నిరోధక విభాగంలో పొన్‌మాణిక్కవేల్ పనిచేస్తున్నప్పుడు చెన్నైకి చెందిన పలువురు విగ్రహాల స్మగ్లర్లను అరెస్టు చేసి ప్రాచీన విగ్రహాలను ప్రభుత్వపరం చేసి మంచిపేరు సంపాదించుకున్నారు. 2018లో ఆయన పదవీ విరమణ చేశారు.

పంద్రాగస్టుకు లక్షమంది పోలీసులతో

భారీ భద్రతా ఏర్పాట్లు



సెంట్రల్ స్టేషన్ వద్ద ప్రయాణికుల లగేజీలను మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేస్తున్న పోలీసులు

చెన్నై, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఐసిస్ ఉగ్రవాది రిజ్వాన్ అరెస్టయిన నేపథ్యంలో స్వాతంత్ర్య దినోత్సవాలకు రాష్ట్రంలో రాజధాని నగరం చెన్నై నుంచి కన్నియాకుమారి వరకు సుమారు లక్షమందికి పైగా పోలీసులతో భారీ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. దేశంలో స్వాతంత్ర్య దినోత్సవాలను భగ్నం చేసేందుకు ఉగ్రవాదులు కుట్ర పన్నుతున్నట్లు రహస్య సమాచారం అందటంతో భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టమంటూ కేంద్ర ఇంటెలిజెన్స్ శాఖ అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. స్వాతంత్ర్య దినోత్సవాలకు ఇక నాలుగు రోజులే మిగిలి ఉండటంతో భద్రతా ఏర్పాట్ల విషయమై డీజీపీ శంకర్ జివాల్ అన్ని జిల్లాల ఎస్పీలకు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు, బిజినెస్ మాల్స్ తదితర జనసమ్మర్ధ ప్రాంతాల్లో పోలీసులు నిఘా తీవ్రతరం చేస్తున్నారు. కోయంబేడు మార్కెట్, కీలంబాక్కం బస్ టెర్మినల్, మాధవరం బస్‌స్టేషన్, బ్రాడ్వే బస్టాండు, సెంట్రల్ రైల్వేస్టేషన్, తాంబరం, పెరంబూరు, ఆవడి, అంబత్తూరు రైల్వేస్టేషన్లు తదితర ప్రాంతాల వద్ద పోలీసులు మఫ్టీలో గస్తీ తిరుగుతున్నారు.

చెన్నై వ్యాప్తంగా...

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సెయింట్ జార్జికోటపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మువ్వన్నెల పతాకాన్ని ఎగురవేయనున్నారు. పోలీసుల కవాతును, విద్యార్థులు, కళాకారులు నిర్వహించే సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించనున్నారు. ప్రస్తుతం సచివాలయ చుట్టూ సాయుధ పోలీసులు భద్రతా విధులు నిర్వరిస్తున్నారు. నగరమంతటా సుమారు 15 వేల మంది పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇక సచివాలయంలోకి వెళ్లేవారిని పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేసిన మీదటే అనుమతిస్తున్నారు. ఇక ఉగ్రవాదులు సముద్రమార్గంలో చొరబడేందుకు వీలులేకుండా చెన్నై నుంచి కన్నియాకుమారి దాకా రాష్ట్ర సముద్రతీర భద్రతాదళం అధికారులు, కోస్ట్‌గార్డ్ సిబ్బంది సంయుక్తంగా గస్తీ నౌకల్లో తిరుగుతున్నారు.

చెన్నైకి తాగునీటి కొరత లేదు

● మెట్రోవాటర్ బోర్డు



వీరాణం చెరువు

ప్యారీస్, ఆగస్టు 10: నగరవాసుల తాగునీటి అవసరాలు తీర్చే రిజర్వాయర్లలో నీటినిల్వలు పెరుగుతున్నందువల్ల నీటి కొరత ఉండబోదని చెన్నై మెట్రోవాటర్ బోర్డు అధికారులు తెలిపారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలోని 200 వార్డుల్లో నివసిస్తున్న ప్రజలకు రిజర్వాయర్లలో నిల్వ ఉంచిన నీటిని శుద్ధీకరించి కొళాయిలు, ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నారు. ఏప్రిల్, మే, జూన్, జూలై నెలల్లో తాగునీటి అవసరాలు క్రమక్రమంగా పెరుగుతూ వచ్చినప్పటికీ, కొరత లేకుండా మెట్రోవాటర్ బోర్డు అందించింది. కడలూరు జిల్లాలోని వీరాణం చెరువు అడుగింటిన పరిస్థితుల్లో కూడా రాజధాని నగరంలో ప్రజలు నీటి కోసం ఇబ్బంది పడకుండా తాగునీటి సరఫరా జరిగింది. నైరుతి రుతుపవనాల ప్రభావం వల్ల పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో కురుస్తున్న భారీవర్షాల కారణంగా అక్కడున్న డ్యాంల నుంచి మిగులు జలాలను కావేరి నదిలో విడుదల చేస్తున్నారు. ఈ నీటి చేరికతో వీరాణం డ్యాం నిండింది. ఇందువల్ల సాగునీరు లేక ఎండిపోయిన డెల్టా ప్రాంతాలు సైతం ప్రస్తుతం నీటి రాకతో కళకళలాడుతున్నాయి. అంతేకాకుండా, వీరాణం నుంచి నగరానికి ప్రతి రోజు 1,110 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. మరోవైపు 180 మిలియన్ లీటర్ల నీరు శుద్ధీకరిస్తున్నారు. కాగా, ఇటీవల ప్రారంభించిన నెమ్మేలి నిర్లవణీకరణ కేంద్రం నుంచి నగరానికి ప్రతిరోజు 150 మిలియన్ లీటర్ల తాగునీరు అడయార్‌లో ఉన్న ప్రజలకు కొళాయిల ద్వారా సరఫరా అవుతోంది. తిరువళ్లూర్ జిల్లాలో ఉన్న పూండి రిజర్వాయర్‌లో 86 ఘనపుటడుగులు, చెంబరంబాక్కం రిజర్వాయర్‌లో 1,491 మిలియన్ ఘనపుటడుగులు, చోళవరం రిజర్వాయర్‌లో 98 మిలియన్ ఘనపుటడుగులు, కన్నన్‌కోట తేర్వాయి కండిగలో 307 మిలియన్ ఘనపుటడుగుల నీటి నిల్వలున్నాయి. తెలుగు గంగ ప్రాజెక్ట్ పథకం కింద కృష్ణా నదీజలాలు విడుదల చేయనున్న కారణంగా మరో రెండు నెలల వరకు తాగు నీటి కొరత ఉండబోదని అధికారులు స్పష్టం చేశారు.

గ్రేటర్‌లో 500 లో ఫుట్ బోర్డు లగ్జరీ ఎలక్ట్రిక్ బస్సులు



ప్యారీస్, ఆగస్టు 10: రాజధాని నగరంలో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో 500 లో ఫుట్ బోర్డు లగ్జరీ ఎలక్ట్రిక్ బస్సు సేవలను ప్రారంభించనున్నట్లు చెన్నై మెట్రో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) తెలిపింది. ఎంటీసీ నడుపుతున్న సిటీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ రోజురోజుకు పెరుగుతూ వస్తోంది. డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులతో పాటు ఎయిర్ కండిషన్ బస్సులు కూడా నడుపుతున్న ఎంటీసీ... ప్రయాణికులకు మరిన్ని వసతులు కల్పించేలా 500 లో ఫుట్ బోర్డు లగ్జరీ ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. వీటిలో 100 బస్సులు ఎయిర్ కండిషన్ వసతితో కూడినవి కాగా, మిగిలిన 400 బస్సులు ఏసీ వసతి లేనివి. ఏసీ బస్సు రూ.2 కోట్లతో, నాన్ ఏసీ బస్సులు తలా రూ.1.85 కోట్లతో కొనుగోలు చేయనుంది. ఈ బస్సుల కొనుగోలుకు రాష్ట్రప్రభుత్వం అనుమతులు జారీ చేయడంతో మొత్తం రూ.960 కోట్లు కేటాయించింది. ఇందులో 70 శాతం నిధులు ప్రపంచ బ్యాంక్ నుంచి కాగా, మిగతా నిధులు రాష్ట్రప్రభుత్వం మంజూరు చేయనుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ ఆధునిక బస్సు సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం సెప్టెంబరు నెలాఖరులో టెండర్లు ఆహ్వానించనున్నారు. ఈ 500 బస్సులను పెరుంబాక్కం, క్రోంపేట, తండయార్‌పేట, సెమ్మంజేరి, కేకే నగర్ ప్రాంతాల్లో ఉన్న డిపోల నుంచి నడుపుతాచరు. ఈ పథకానికి సంబంధించి ఎంటీసీ, తమిళనాడు ప్రభుత్వ రవాణా సంస్థ, ప్రపంచ బ్యాంకు మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు అధికారులు తెలిపారు.

26న చెన్నైకి పురందేశ్వరి రాక



చెన్నై, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఈ నెల 26న చెన్నైకి రానున్నారు. స్థానిక శ్రీకళాసుధ రజతోత్సవాల ముగింపు ఉత్సవాలకు, కృష్ణాష్టమి వేడుకలకు ఆమె విశిష్ట అతిథిగా హాజరుకానున్నారు. మ్యూజిక్ అకాడమీలో ఈ వేడుకలు ఘనంగా జరుగుతాయని శ్రీకళాసుధ వ్యవస్థాపక అధ్యక్షుడు బేతిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు శనివారం పురందేశ్వరిని కారంచేడులో మర్యాదపూర్వకంగా కలుసుకుని ఆహ్వానించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఇళ్ల ముందు 'నో పార్కింగ్' బోర్డులు తొలగించాలంటూ

పిటిషన్

● కార్పొరేషన్, ట్రాఫిక్ పోలీసులకు హైకోర్టు నోటీసు



పెరంబూర్, ఆగస్టు 10: నగరంలో ఇళ్ల ముందు భాగాల్లో ఏర్పాటు చేసిన 'నో పార్కింగ్' బోర్డులు తొలగించాలనే పిటిషన్‌పై అఫిడవిట్లు దాఖలు చేయాలని కార్పొరేషన్, ట్రాఫిక్ పోలీసులు విభాగాలకు మద్రాసు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మద్రాసు హైకోర్టులో నందకుమార్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌లో... చెన్నైలో అడయార్, మైలాపూర్, టీనగర్, శాంథోమ్, అశోక్‌నగర్, కే.కే.నగర్, వేళచ్చేరి, క్రోంపేట, తాంబరం సహా పలు ప్రధాన ప్రాంతాల్లో నివసించే వారు తమ ఇళ్ల ముందు అనుమతులు లేకుండా నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారని, దీంతో, తమ ఇంటి ముందున్న రోడ్లపై వాహనాలు నిలిపే సమయంలో వారు వాగ్వాదాలకు దిగుతున్నారని పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇళ్ల ముందు నో పార్కింగ్ బోర్డుతో పాటు పూల మొక్కలు ఏర్పాటుచేసి వాహనచోదకులు ఇబ్బందులు కలుగజేస్తున్నారని, దీంతో వాహనాలు పార్కింగ్ చేసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ విషయమై సమాచార హక్కు చట్టం ద్వారా అడిగిన ప్రశ్నకు, ఇంటి ప్రాంగణాల్లో నో పార్కింగ్ బోర్డు ఏర్పాటుకు ఎవ్వరికీ అనుమతులివ్వలేదని చెన్నై కార్పొరేషన్ ట్రాఫిక్ విభాగం, కార్పొరేషన్ సమాధానమిచ్చిందని పేర్కొన్నారు. అందువల్ల అనుమతులు లేకుండా ఇళ్ల ముందు ఏర్పాటు చేసిన నో పార్కింగ్ బోర్డులు తొలగించేలా ఉత్తర్వులు జారీ చేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ విచారించిన హైకోర్టు తాత్కాలిక న్యాయమూర్తి కృష్ణన్‌కుమార్, న్యాయమూర్తి బాలాజీలతో కూడిన ధర్మాసనం... నగరంలో 'నో పార్కింగ్' బోర్డులు తొలగించేలా చేపట్టిన చర్యలేంటి? అనే విషయమై నివేదిక దాఖలు చేయాలని చెన్నై నగర ట్రాఫిక్ పోలీసు శాఖ, కార్పొరేషన్ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసి, తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.

సమాచార దర్శిని

వైద్యకోర్సులకు 42,957 మంది దరఖాస్తు

ఐసిఎఫ్, ఆగస్టు 10: ఎంబీబీఎస్, బీడీఎస్ వైద్యకోర్సులకు 42,957 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో 9,050 ఎంబీబీఎస్, 2,200 బీడీఎస్ సీట్లున్నాయి. ఈ సీట్లకు దరఖాస్తుల స్వీకరణ 9వ తేదీ శుక్రవారంతో ముగిసింది.దరఖాస్తులు పరిశీలించి ఈనెల 19న ర్యాంకుల జాబితా విడుదల చేసి, 21వ తేది అడ్మిషన్లు ప్రారంభించనున్నారు.

చెన్నై - రేణిగుంట మార్గంలో 'కవచ్' భద్రత

ఐసిఎఫ్, ఆగస్టు 10: చెన్నై - రేణిగుంట మార్గంలో 'కవచ్' భద్రత కల్పించనున్నారు. దక్షిణ రైల్వేలో జోలార్‌పేట - సేలం - ఈరోడ్, విల్లుపురం - కాట్పాడి, కరూర్ - దిండుగల్, చెన్నై బీచ్ - తాంబరం - చెంగల్పట్టు, మదురై - కన్నియాకుమారి, షోరనూర్ - సేలం, ఈరోడ్ - కరూర్ మార్గాల్లో దశలవారీగా కవచ్ భద్రత, సాంకేతిక సౌకర్యాలు కల్పించనున్నారు. తొలివిడతగా చెన్నై సెంట్రల్ - అరక్కోణం, అరక్కోణం - రేణిగుంట, చెన్నై సెంట్రల్-గూడూరు మార్గాల్లో 217 కి.మీ దూరం కవచ్ భద్రతా ఏర్పాట్లకు టెండర్లు విడుదలయ్యాయి. రూ.125.11 కోట్లతో సాంకేతిక సౌకర్యం కల్పించనున్నారు.

తాంబరంలో 15నుంచి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నో హాల్ట్

ఐసిఎఫ్, ఆగస్టు 10: స్థానిక తాంబరం రైల్వేస్టేషన్‌లో ఈ నెల 15, 16, 17 తేదీల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగకుండా వెళతాయని దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు. తాంబరం రైల్వే యార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్లాట్‌ఫారాల విస్తరణ పనుల కోసం ఎక్స్‌ప్రెస్, సబర్బన్ రైళ్ల సేవల్లో ఈనెల 14వ తేది వరకు మార్పులు చేశారు. ప్రస్తుతం మరో మూడు రోజులు అదనంగా పనులు జరుగనుండడంతో ఎక్స్‌ప్రెస్ రైళ్లు 15 నుంచి 17వ తేది వరకు తాంబరంలో ఆగకుండా, దానికి బదులుగా మాంబళం రైల్వేస్టేషన్‌లో ఆగి వెళతాయని అధికారులు తెలిపారు.

పాలిటెక్నిక్ అడ్మిషన్ గడువు పొడిగింపు

ఐసిఎఫ్, ఆగస్టు 10: పాలిటెక్నిక్‌లలో విద్యార్థుల అడ్మిషన్ గడువు పొడిగిస్తూ ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో పని చేసే అన్ని పాలిటెక్నిక్‌లో 2024-25 విద్యా సంవత్సరం రెండవ సంవత్సరం డిప్లొమా కోర్సుల అడ్మిషన్లు, మొదటి సంవత్సరం, పార్ట్ టైం కోర్సుల అడ్మిషన్లు ముగిశాయి. జూలై 1వ తేది నుంచి తరగతులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, విద్యార్థుల సంఖ్య పెంచేలా సప్లిమెంటరీ పరీక్షలు రాసిన విద్యార్థుల సౌకర్యార్థం ఈ నెల 14వ తేది వరకు అడ్మిషన్ గడువు పొడిగించారు.

రేపటినుంచి 8వ తరగతి పబ్లిక్ పరీక్షల హాల్‌టిక్కెట్ల విడుదల

ఐసిఎఫ్, ఆగస్టు 10: ప్రైవేటు విద్యార్థులు 8వ తరగతి పబ్లిక్ పరీక్ష హాల్‌టిక్కెట్లు ఈ నెల 12వ తేది నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రభుత్వ పరీక్షల డైరెక్టరేట్ తెలిపింది. ఈ నెల 19 నుంచి 23వ తేది వరకు ప్రైవేటు విద్యార్థులకు 8వ తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగనున్నాయి. www.dge.tn.in నుంచి ఈ నెల 12వ తేది సాయంత్రం 4 గంటల నుంచి విద్యార్థులు తమ హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, ఆగస్టు 10: విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా స్థానిక తాంబరం పరిధిలోని తాంబరం మెప్స్ కాంప్లెక్స్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

మీనంబాక్కం - క్రోంపేట మీదుగా పూందమల్లికి మెట్రోరైలు?

ఐసిఎఫ్, ఆగస్టు 10: పరందూర్ విమానాశ్రయానికి త్వరగా చేసుకునేలా మీనంబాక్కం - క్రోంపేట మీదుగా పూందమల్లికి మెట్రోరైలు మార్గం ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మొదటి విడతలో తిరువొత్తియూర్ వింకోనగర్ - విమానాశ్రయం, సెంట్రల్ - సెయింట్ థామస్ మౌంట్ మధ్య 55 కి.మీ మెట్రోరైళ్లు నడుస్తుండగా, ప్రస్తుతం రెండో విడత పనులు మాధవరం - షోళింగనల్లూర్, లైట్‌హౌస్ - పూందమల్లి, మాధవరం - సిరుచ్చేరి సిప్కాట్ వరకు 116 కి.మీ మెట్రోరైలు మార్గం, స్టేషన్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, పూందమల్లి - పరందూర్, విమానాశ్రయం - కీలంబాక్కం, కోయంబేడు - ఆవడి వరకు ఈ మార్గాన్ని పొడిగించేందుకు సీఎంఆర్ఎల్ చర్యలు చేపట్టింది. ఇదే విధంగా సిరుచ్చేరి నుంచి కీలంబాక్కం మీదుగా తిరుపోరూర్ వరకు ఈ మార్గాన్ని పొడించనున్నారు. అలాగే, మీనంబాక్కం విమానాశ్రయం నుంచి క్రోంపేట మీదుగా పూందమల్లి వరకు 15 కి.మీ కొత్త మార్గం ఏర్పాటుకు నిర్ణయించారు.

ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగింపు

పెరంబూర్, ఆగస్టు 10: ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగిస్తూ దక్షిణ రైల్వే ప్రకటన విడుదల చేసింది.

- నెం.07695 సికింద్రాబాద్ - రామనాథపురం ప్రత్యేక రైలు (బుధవారం) ఈ నెల 21 నుంచి సెప్టెంబరు 25వ తేది వరకు, నెం.07696 రామనాథపురం - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు (శుక్రవారం) ఈ నెల 23 నుంచి సెప్టెంబరు 27వ తేది వరకు పొడిగించారు.
- నెం.07153 నరసాపూర్ - ఎస్ఎంబీటీ బెంగళూరు ప్రత్యేక రైలు (శుక్రవారం) ఈ నెల 16 నుంచి సెప్టెంబరు 27వ తేది వరకు, నెం.07154 ఎస్ఎంవీటీ బెంగళూరు - నరసాపూర్ ప్రత్యేక రైలు (శనివారం) ఈ నెల 17 నుంచి సెప్టెంబరు 29వ తేది వరకు పొడిగించారు.

మదురై - చెన్నై - కాశి ప్రత్యేక యాత్రా రైలు

పెరంబూర్,ఆగస్టు10:మహాలయ అమావాస్యను పురస్కరించుకుని మదురైనుంచి చెన్నైమీదుగా గయకు ప్రత్యేక యాత్రా రైలు నడపనున్నారు.మదురై నుంచి సెప్టెంబరు 30వ తేది బయల్దేరే రైలు, మదురై, దిండుగల్, తిరుచ్చి, విల్లుపురం, చెన్నై ఎగ్మూర్ మీదుగా వెళ్లనుంది. 10 రోజుల పర్యాటనకు స్లీపర్ బోగీ ఛార్జీ రూ.20,500, త్రీ టైర్ ఏసీ బోగీ ఛార్జీ రూ.23,600గా నిర్ణయించారు. వివరాలకు నెం.7305858585లో సంప్రదించవచ్చు.

ఇంటి వద్దకే జాతీయ పతాకం

● తపాలాశాఖ కొత్త పథకం

పెరంబూర్, ఆగస్టు 10: ఆర్డరు చేసిన వారి ఇళ్ల వద్దకే జాతీయ పతాకం అందించనున్నట్లు తపాలా శాఖ ప్రకటించింది. దేశ 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఈ నెల 15న దేశ ప్రజలు జరుపుకోనున్నారు. ఇందుకోసం కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఆ రోజున జాతీయ పతాకాలు ఎగురవేయనున్నారు. ఈ నేపథ్యంలో, జాతీయ పతాకాల విక్రయాలను తపాలా శాఖ ప్రారంభించింది. ఒక జెండా రూ.25 చొప్పున పోస్టాఫీసుల్లో విక్రయించనున్నారు. అలాగే, https://www.epostoffice.gov.inలో తమ చిరునామా నమోదుచేసి ఆన్‌లైన్ ద్వారా ఆర్డరు చేసిన వారి ఇళ్లకే వెళ్లి జాతీయ పతాకాలు అందజేయనున్నట్లు తపాలా శాఖ తెలియజేసింది.

మదురైను ముంచెత్తిన వర్షాలు

పెరంబూర్, ఆగస్టు 10: మదురైలో శుక్రవారం అర్ధరాత్రి హఠాత్తుగా కురిసిన భారీవర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. పశ్చిమ గాలుల వేగంలో మార్పుల కారణంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో, మదురై నగరంలో శుక్రవారం రాత్రి ఈదురుగాలులతో భారీవర్షం కురిసింది. అన్నానగర్, కలెక్టర్ కార్యాలయం, గోరిపాళయం, మాట్టుదావని, సిమ్మక్కల్, రైల్వేస్టేషన్, గోమతిపురం, అనుపాండి, అరపాళయం, కలైనగర్, ఆనైయూర్, వళ్లవర్ కాలనీ, తిరుప్పరంకుండ్రం, సికందర్ కాలనీ, మాట్టుకుళం తదితర ప్రాంతాల్లోని రహదారులు జలమయమయ్యాయి. దీంతో వాహనాలు నెమ్మదిగా వెళ్లడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది.


జలమయమైన రోడ్లు

హొగెనేకల్‌కు పెరిగిన ఇన్‌ఫ్లో

ఐసిఎఫ్, ఆగస్టు 10: హొగెనేకల్ ఇన్‌ఫ్లో 20,000 ఘనపుటడుగులకు పెరిగింది. కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో నైరుతి రుతుపవనాల వర్షాలు తీవ్రరూపం దాల్చాయి. ఈ కారణంగా కర్ణాటక రాష్ట్రంలో ఉన్న కబిని, కృష్ణరాజసాగర్ డ్యాంలు నిండడంతో అదనపు జలాలు కావేరి నదిలో విడుదల చేస్తున్నారు. దీంతో ధర్మపురి జిల్లా హొగెనేకల్‌కు ఇన్‌ఫ్లో 25,000 ఘనపుటడుగుల నుంచి 2 లక్షల ఘనపుటడుగుల వరకు పెరిగాయి. ఈ నేపథ్యంలో, కర్ణాటక డ్యాం నుంచి ఇన్‌ఫ్లో క్రమేణా తగ్గడంతో హొగెనేకల్ ఇన్‌ఫ్లో కూడా క్రమేణా తగ్గి, శుక్రవారం 8,000 ఘనపుటడుగులకు తగ్గింది. ఈ నేపథ్యంలో, కర్ణాటక డ్యాం నుంచి శుక్రవారం మళ్లీ 17,000 ఘనపుటడుగుల నీరు కావేరి నదిలో విడుదల చేయడంతో, శనివారం ఉదయం సెకనుకు 20,000 ఘనపుటడుగులుగా హొగెనేకల్ వద్ద ఇన్‌ఫ్లో పెరిగింది. ప్రధాన జలపాతం, సినీ ఫాల్స్ వంటి జలపాతాల్లో ప్రవాహం ఉధృతంగా ఉండడంతో పర్యాటకుల స్నానాలకు నిషేధం విధించారు.

పుదుచ్చేరిలో కుండపోత

వరదలో యువకుడి గల్లంతు

చెన్నై, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల ప్రభావం, పడమటి దిశ గాలి వేగంలో ఏర్పడిన మార్పుల కారణంగా పుదుచ్చేరిలో గత రెండు రోజులుగా కుండపోత వర్షాలు కురిశాయి. జీవానందపురం వాగు వద్ద ఓ యువకుడు నీటిలో గల్లంతయ్యాడు. పుదుచ్చేరివ్యాప్తంగా గురువారం సాయంత్రం 6 నుంచి రాత్రి 8గంటల వరకు ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. 11 సెం.మీల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇక శుక్రవారం మధ్యాహ్నం ఎండ విపరీతంగా కాసింది.సాయంత్రం ఉన్నట్టుండి వాతావరణం చల్లబడి చల్లటి గాలులు వీచాయి. రాత్రి 9.30 గంటలకు ఉరుములు, మెరుపులతో కుండపోత వర్షం ప్రారంభమైంది. రాత్రి 11 గంటల దాకా కురిసిన ఈ వర్షానికి జనజీవనం స్తంభించింది. రహదారులు జలమయమయ్యాయి. పల్లపు ప్రాంతాలు దీవులుగా మారాయి. ఇళ్లలోకి వర్షపునీరు చొరబడింది. ఇదిలా ఉండగా లాస్‌పేట మేట్టు ప్రాంతం నుంచి వర్షపునీరంతా వరదలా పల్లపు ప్రాంతమైన జీవానందపురం ఓడై మీదుగా కొక్కుపాలెం దాటుకుని ప్రవహించింది. ఆ వాగు సమీపంలో నిలిపి ఉంచిన బైకును తీసుకునేందుకు వెళ్లిన అయ్యప్పన్ నీటిలో కొట్టుకుపోయాడు. అతడిని కాపాడేందుకు వెళ్లిన ఇద్దరు కూడా ఆ వాగులో కొట్టుకుపోయారు. స్థానికులు గమనించి ఇద్దరికి కాపాడారు. అయ్యప్పన్ జాడను కనుగొనలేకపోయారు. అగ్నిమాపక దళం ముమ్మరంగా గాలిస్తోంది. ఈ సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే వైద్యనాథన్ ఆ ప్రాంతానికి చేరుకుని అధికారులతో సమీక్షించారు. కాగా భారీ వర్షాల కారణంగా పుదుచ్చేరిలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించారు.

జార్ఖండ్ సీఎంకు స్టాలిన్ జన్మదిన శుభాకాంక్షలు



ప్యారీస్, ఆగస్టు 10: జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ జన్మ దినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్య మంత్రి స్టాలిన్ సామాజిక మాధ్యమాల ద్వారా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు శనివారం సచివాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. అందులో... ఎన్నో అడ్డంకులు ఎదుర్కొంటూ ప్రజల హక్కుల కోసం అలుపెరగని పోరాటం సాగిస్తున్న జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ మనోధైర్యంతో ముందుకు సాగుతున్నారని, అంకితభావంతో ప్రజలకు సేవలందిస్తున్న ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలంటూ సీఎం స్టాలిన్ తన శుభాకాంక్షల్లో తెలిపారు.

ప్రొఫెసర్ల నియామకంలో అవకతవకలు

● విచారణకు ఆదేశించిన హైకోర్టు

పెరంబూర్, ఆగస్టు 10: ప్రొఫెసర్ల నియామకాల్లో జరిగిన అవకతవకలపై విచారించాలని మద్రాసు విశ్వవిద్యాలయానికి మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. మద్రాసు వర్సిటీ పరిధిలో ప్రొఫెసర్ల నియామకాల్లో అవకతవకలు జరిగాయని 2018 సంవత్సరంలో ఫిర్యాదులందాయి. ఈ వ్యవహారంపై విచారణకు కమిటీని ఏర్పాటు చేయాలని వర్సిటీ తీర్మానించింది. అయితే కమిటీని ఏర్పాటు చేయకపోవడంపై సయ్యద్ రహంతుల్లా అనే వ్యక్తి 2019లో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో, ఈ కేసు మద్రాసు హైకోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి కృష్ణన్‌కుమార్ నేతృత్వంలో ధర్మాసనం విచారించింది. విచారణ ఆరు నెలల్లో పూర్తిచేయాలని, ప్రొఫెసర్ల నియామకాల్లో నిబంధనలు అతిక్రమించినట్లు నిర్ధారణ అయితే చర్యలు చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేసింది. అదే సమయంలో, ప్రొఫెసర్ల నియామకాల్లో అవకతవకలు జరిగినట్లు పిటిషన్‌దారులెవ్వరూ తమకు ఫిర్యాదు చేయలేదని మద్రాసు విశ్వవిద్యాలయం తరపున హైకోర్టుకు తెలియజేయడం గమనార్హం.

వేపంగనేరి పంచాయతీ అధ్యక్షుడికి జాతీయ పురస్కారం


కేంద్ర మంత్రి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న ఎస్వీకే మోహన్

వేలూరు, ఆగస్టు 10: జిల్లాలోని కేవీ కుప్పం యూనియన్ వేపంగనేరి పంచాయతీ అధ్యక్షుడు ఎస్వీకే మోహన్‌కు జాతీయ పురస్కారం లభించింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో మోహన్ పురస్కారం అందుకున్నారు. ఈ పురస్కారంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని, పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా మోహన్ తెలిపారు.

విద్యార్థులు, ప్రధానోపాధ్యాయుల అభినందన సభ


శ్రీ వెంకటేశ్వర హయ్యర్ సెకండరీ పాఠశాల ప్రధానోపాధ్యయుడు నెపోలియన్‌ను సత్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

వేలూరు, ఆగస్టు 10: గత విద్యా సంవత్సరంలో 10, 11, 12 పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు, 100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయుల అభినందన సభ శనివారం జరిగింది. స్థానిక శ్రీ వెంకటేశ్వర హయ్యర్ సెకండరీ స్కూలు ప్రాంగణంలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో, అధిక మార్కులు పొందిన విద్యార్థులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నెపోలియన్‌ను సత్కరించి, బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

కారులో హఠాత్తుగా మంటలు



పెరంబూర్, ఆగస్టు 10: స్థానిక అన్నాసాలైలో కారులో హఠాత్తుగా మంటలు చెలరేగాయి. శనివారం ఉదయం సైదాపేట నుంచి అన్నాసాలై నుంచి ఎగ్మూర్ వైపునకు ఓ కారు వెళుతోంది. నందనం సిగ్నల్ సమీపంలో కారు ముందు భాగంలో పొగలు రావడాన్ని గుర్తించిన డ్రైవర్ వెంటనే నిలిపివేశాడు. క్షణాల్లోనే కారు ముందు భాగంలో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో అటుగా వెళుతున్న కొందరు తమ వాహనాలు రోడ్డు పక్కనే నిలిపివేసి, సమీపంలోని దుకాణాల నుంచి నీరు తీసుకొచ్చి మంటలు ఆర్పేందుకు యత్నించారు. అంతలోపే కారు మొత్తం మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న సైదాపేట అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలు అదుపుచేశారు. ఈలోపు కారు పూర్తిగా కాలిపోయింది. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.


వేలూరు జిల్లా ఆనైకట్టు డివిజన్ విరింజిపురం పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పథక పనులను శనివారం పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి, పంచాయతీ అధ్యక్షులు గుణసుందరి బాలచంద్రన్ తదితరులు

పాఠశాల నిర్వహణ కమిటీ ఎంపిక సమావేశాలు


విరింజిపురం పాఠశాల సమావేశంలో పాల్గొన్న తల్లిదండ్రులు

వేలూరు, ఆగస్టు 10: జిల్లావ్యాప్తంగా శనివారం పాఠశాలల నిర్వహణ కమిటీల ఎంపిక సమావేశాలు ఆయా పాఠశాలల్లో ప్రారంభమయ్యాయి. జిల్లాలో 507 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 151 మాధ్యమిక పాఠశాలలు, 134 ఉన్నత, మహోన్నత పాఠశాలలున్నాయి. వీటిలో తొలివిడతగా 256 పాఠశాలల నిర్వహణ కమిటీ సభ్యుల ఎంపిక సమావేశం జరిగింది. 2024-25 విద్యా సంవత్సరానికి ఈ కమిటీలను ఎంపిక చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆనైకట్టు పంచాయతీ యూనియన్ విరింజిపురం ప్రాథమిక పాఠశాలలో జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన విద్యాధికారి మణిమొళి, జిల్లా ప్రాథమిక విద్య అధికారి దయాళన్, విరింజిపునరం పంచాయతి యూనియన్ అధ్యక్షుడు గుణసుందరి బాలచంద్రన్, అనైకట్టు తహసీల్దార్ సహా పలువురు అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా 100 మంది విద్యార్థులకు యూనిఫాం అందజేశారు.

వైభవంగా ఆనకులత్తమ్మాళ్ ఆలయ రథోత్సవం


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వేలూరు, ఆగస్టు 10: స్థానిక అరసమరంపేట గ్రామదేవత ఆన కులత్తమ్మాళ్ అమ్మవారి రథోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, ఆరాధనలు జరిగాయి. ఈ వేడుకల్లో 2వ మండల కమిటీ అధ్యక్షుడు, కౌన్సిలర్ వీసస్ నరేంద్రన్, వేడుకల ఆర్గనైజర్, కోశాధికారి రామన్, అధ్యక్షుడు పార్తిబన్, సెంథిల్, శరవణన్, సుబ్రమణి, రామమూర్తి, ఆనందన్, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆమ్‌స్ట్రాంగ్ సతీమణి, పా.రంజిత్‌పై కేసు నమోదు

అడయార్, ఆగస్టు 10: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ సతీమణి పొర్కొడితో పాటు సినీ దర్శకుడు పా.రంజిత్‌పై స్థానిక నుంగంబాక్కం పోలీసులు కేసు నమోదు చేశారు. గత నెల 5న ఆమ్‌స్ట్రాంగ్ దారుణహత్యకు గురయ్యారు. ఈ కేసులో ఇప్పటివరకు 22 మందిని అరెస్టు చేశారు. తిరువేంగడం అనే నిందితుడు మాధవరం వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. అయితే, తన భర్త హత్య కేసులో నిజమైన దోషులను అరెస్టు చేయాలని, విచారణను సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ కార్యకర్తలతో కలిసి ఆమ్‌స్ట్రాంగ్ సతీమణి పొర్కొడి పోలీసుల నుంచి ముందస్తు అనుమతి లేకుండా స్థానిక నుంగంబాక్కం, వళ్ళువర్‌కోట్టమ్ వద్ద ఆందోళనకు దిగారు. ఆ ధర్నాలో తమిళ సినీ దర్శకుడు పా.రంజిత్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంజిత్ మాట్లాడుతూ, ఆమ్‌స్ట్రాంగ్ వెంట ఉన్నవారే ఆయన హత్యకు సహకరించారన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతు న్నట్లు తెలిపారు. అయితే, ఈ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ముందస్తు అనుమతి తీసుకోలేదని పేర్కొంటూ పొర్కొడి, పా.రంజిత్‌తో సహా సుమారు 500 మందిపై నుంగంబాక్కం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసులో రౌడీ నాగేంద్రన్ విచారణకు ప్లాన్



అడయార్, ఆగస్టు 10: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసులో వ్యాసర్పాడికి చెందిన పేరుమోసిన రౌడీ నాగేంద్రన్‌ను కస్టడీలోకి తీసుకుని విచారించాలని పోలీసులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఆయన వేలూరు జైలులో శిక్షా ఖైదీగా ఉన్నారు. గత నెల 5న ఆమ్‌స్ట్రాంగ్ హత్యకు గురికాగా, ఈ కేసులో ఇప్పటికే 22 మందిని అరెస్టు చేశారు. తిరువేంగడం అనే నిందితుడు ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయాడు. ఆమ్‌స్ట్రాంగ్ హత్య కోసం పలువురు రౌడీలను ఒక తాటిపైకి తీసుకొచ్చింది వ్యాసర్పాడికి చెందిన రౌడీ నాగేంద్రన్ అని పోలీసులు నిర్ధరించారు. ఆ తర్వాత ఆయన పేరును నిందితుల జాబితాలో చేర్చి అరెస్టు చేసినట్టుగా నోటీసు ఇచ్చేందుకు పోలీసులు ప్రయత్నించగా, దాన్ని జైలులో ఉన్న నాగేంద్రన్ స్వీకరించలేదు. దీంతో ఆయన ఉండే జైలు గదికి నోటీసును అంటించారు. ప్రస్తుతం ఆయన్ను ఎగ్మోర్ ఐదో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచేందుకు సిద్ధమవుతున్నారు. ఆ సమయంలో ఆయనను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు. కోర్టు అనుమతి మేరకు నాగేంద్రన్‌ను కస్టడీలోకి తీసుకుని విచారిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని భావిస్తున్నారు. అదేసమయంలో ఈ హత్యతో సంబంధం ఉన్నట్టు భావిస్తున్న రౌడీలైన తండయారుపేటకు చెందిన సెంథిల్, తాంబరం, మన్నివాక్కంకు చెందిన సీసింగ్ రాజా పరారీలో ఉన్నారు.వీరిని పట్టుకునేందుకు ప్రత్యేకబృందాన్ని ఏర్పాటు చేశారు.

ఇద్దరి ప్రాణాలు బలిగొన్న పొగ

ప్యారీస్, ఆగస్టు 10: దిండుగల్ జిల్లాలో ప్రముఖ వేసవి విడిది కేంద్రవ కొడైకెనాల్‌లోని కాటేజీలో దట్టంగా వ్యాపించిన పొగకు ఊపిరాడక ఇద్దరు పర్యాటకులు మృతిచెందారు. చెన్నై, తిరుచ్చిలకు చెందిన నలుగురు యువకులు కొడైకెనాల్‌లోని చిన్నంపల్లం వెళ్లే దారిలో ఉన్న కాటేజీలో బస చేశారు. వారు ఉంటున్న గదిలో మాంసాహార వంటకాలను స్వయంగా తయారు చేసుకున్నారు. శుక్రవారం రాత్రి వంట పూర్తయ్యాక స్టౌ ఆర్పకుండా నిద్రలో జారుకున్నారు. ఉదయం పక్క గదిలో ఉన్న మిత్రులు మరో గదిలో ఉన్న ఆనంద్‌బాబు, జయకన్నన్‌ను నిద్ర నుంచి మేల్కొలిపేందుకు ప్రయత్నించగా, వారు విగతజీవులుగా పడి ఉండడం గమనించి దిగ్భ్రాంతి చెందారు. దీనిపై అందజేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి పోలీసులు జరిపిన ప్రాథమిక విచారణలో... మాంసాహారం వండుకున్న స్టౌ ఆర్పని కారణంగా వ్యాపించిన పొగ వల్ల ఇద్దరూ మృతి చెందినట్లు తెలిసింది.

పంచలోహ విగ్రహం స్వాధీనం

● ఏడుగురి అరెస్ట్


స్వాధీనం చేసుకున్న పంచలోహ విగ్రహం

ఐసిఎఫ్, ఆగస్టు 10: చోరీకి గురైన పంచలోహ విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు ఏడుగురిని అరెస్ట్ చేశారు. తంజావూరు - తిరుచ్చి జాతీయ రహదారి మీదుగా ప్రాచీన విగ్రహాన్ని తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సెంగిపట్టి సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా ఉన్న ఒక కారు, రెండు మోటారు సైకిళ్లను అడ్డుకొని తనిఖీ చేశారు. కారులో దాచిన 2.5 అడుగుల పంచలోహ పెరుమాళ్ విగ్ర హాన్ని స్వాధీనం చేసుకున్నారు. అరుంబాక్కానికి చెందిన రాజేంద్రన్, కుంభకోణానికి చెందిన రాజ్‌కుమార్, తిరువారూర్ జిల్లాకు చెందిన దినేష్, జయశంకర్, కడలూరుకు చెందిన విజయ్ సహా ఏడుగురిని అరెస్ట్ చేశారు. విచారణలో... ఇమామ్‌కిలియూర్‌కు చెందిన దినేష్ తండ్రికి 12 ఏళ్ల క్రితం తొలువూరు నదిలో పూడిక తీస్తుండగా విగ్రహం దొరికింది. ఈ విషయాన్ని ఆయన అధికారులకు తెలియజేయకుండా తన పశువుల కొట్టంలో దాన్ని దాచారు. తండ్రి మరణించడంతో ఆ విగ్రహాన్ని దినేష్ రూ2 కోట్లకు విదేశాల్లో ఉన్న వారికి విక్రయించేందుకు నిర్ణయించాడు. ఇందుకోసం తన మిత్రుల సహాయం కోరాడు. విగ్రహాన్ని తరలించే ప్రయత్నంలో ఏడుగురు పట్టుబడినట్లు తెలిపిన పోలీసులు, వారిని కుంభకోణం కోర్టుకు హాజరుపరచి జైలుకు తరలించారు.

బుల్లితెర నటి చిత్ర మృతి కేసులో భర్త హేమంత్ విడుదల


హేమంత్, నటి చిత్ర (ఫైల్‌ఫొటో)

అడయార్, ఆగస్టు 10: బుల్లితెర నటి చిత్ర మృతి కేసులో ఆమె భర్త హేమంత్‌ను కోర్టు నిర్దోషిగా విడుదల చేసింది. 2020లో నగర శివారు ప్రాంతమైన తిరువళ్లూరు జిల్లా, నజరత్‌పేటలో ఉన్న ఒక హోటల్ గదిలో నటి చిత్ర మృతదేహాన్ని గుర్తించారు. ఆమె ఆత్మహత్య చేసుకునేలా భర్త ప్రోత్సహించారని పేర్కొంటూ కేసు నమోదు చేశారు. తమ కుమార్తె మృతి కేసులో సందేహం ఉందంటూ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆమె భర్త హేమంత్ సహా మొత్తం ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ తిరువళ్లూరు జిల్లా మహిళా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో సాగగా, శనివారం తీర్పు వెలువడింది. ఈ కేసు నుంచి హేమంత్‌ను నిర్దోషిగా కోర్టు విడుదల చేసింది. భార్య చిత్ర మృతి కేసులో ఆమె భర్త హేమంత్‌కు ఎలాంటి సంబంధం లేదని, అయన హత్య చేసినట్టు నిరూపించే ఆధారాలు లేవని పేర్కొంటూ నిర్దోషిగా విడుదల చేసింది.

మగబిడ్డను కిడ్నాప్ చేసిన మహిళ అరెస్టు

అడయార్, ఆగస్టు 10: సేలం ప్రభుత్వ ఆస్పత్రిలో ఐదు రోజుల క్రితం జన్మించిన మగబిడ్డను కిడ్నాప్ చేసిన పట్టభద్రురాలైన మహిళను పోలీసులు అరెస్టు చేశారు. ఆస్పత్రి సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా ఆమెను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నామక్కల్ జిల్లా తంగదురై భార్య వెన్నిల(25) పురిటి నొప్పులతో సేలం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరగా, ఈ నెల 5న ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ నేపథ్యంలో 25 యేళ్ల మహిళ... ప్రసూతి వార్డుకు వెళ్లి తమ బంధువులు చికిత్స పొందుతున్నారంటూ చెప్పి వెన్నిలతో మాటలు కలిపింది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఆ మహిళ.. పసికందును తీసుకుని కనిపించకుండా పోయింది. గమనించిన వెన్నిల.. ఆస్పత్రికి సిబ్బందికి చెప్పగా, వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే కేసు నమో దు చేసి విచారణ చేపట్టారు. ఆస్పత్రి సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించగా, పసికందును కిడ్నాప్ చేసిన మహిళను సేలం సమీపంలోని కారిపట్టికి చెందిన వినోదినిగా గుర్తించి అరెస్టు చేశారు. బీఈ పట్టభద్రురాలైన వినోదిని.. అంబాపేటలో ఉన్న ఒక ఇంజనీరింగ్ కాలేజీలో పనిచేస్తోంది. తిరుచ్చికి చెందిన అఖిలన్‌ని వివాహం చేసుకుంది. ఈ క్రమంలో వినోదిని నాలుగు నెలల గర్భవతిగా ఉన్న సమయంలో గర్భస్రావం జరిగింది. ఈ విషయాన్ని ఆమె భర్త, ఇతర కుటుంబ సభ్యులకు చెప్పలేదు. పైగా తాను గర్భంతోనే ఉన్నట్లు నటిస్తూ వచ్చింది. ఈ క్రమంలో గత నెలలో ఆమెకు సీమంతం కూడా చేశారు. ఈ పరిస్థితుల్లో తాను గర్భవతికానని తెలిస్తే తన పరువు పోతుందని భావించి, ఈ పసికందును కిడ్నాప్ చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడించింది. ఆమెపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

తిరుమంగళం ఫ్లైఓవర్ నుంచి దూకి యువకుడి ఆత్మహత్యాయత్నం

అడయార్, ఆగస్టు 10: స్థానిక తిరుమంగళం ఫ్లైఓవర్ నుంచి ఆత్మహత్య చేసుకునేందుకు ఓ యువకుడు కిందకు దూకాడు. అయితే, ఆ యువకుడు ప్రాణాపాయం నుంచి తప్పించుకోగా, కాళ్ళు, చేతులు విరిగాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని యువకుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శనివారం ఉదయం 6.30 గంటల సమయంలో యువకుడు ఫ్లైఓవర్ పైకి వెళ్లి... ఆత్మహత్య చేసుకోబోతున్నట్టుగా బిగ్గరగా కేకలు వేస్తూ ఒక్కసారిగా కిందకు దూకేశాడు. కాళ్లు, చేతులు విరగడంతో పాటు తలకు గాయాలయ్యాయి. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు... 108 అంబులెన్స్ ద్వారా కీల్పాక్కం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

ప్యారీస్, ఆగస్టు 10: తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. అరుంబాక్కానికి చెందిన విశ్వ (24), సంజయ్ (24) మిత్రులు. బైక్‌లో అరక్కోణం సమీపంలోని పల్లియాంకుప్పంలో జరిగిన జాతరలో పాల్గొని ఇంటికి తిరుగుముఖం పట్టారు. వారు తిరుత్తణిలోని లక్ష్మీపురం కుశస్థలి నదిపై ఉన్న వంతెన మీదుగా వెళుతూ బైక్ అదుపు తప్పడంతో డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. అదే విధంగా, తిరుత్తణి రైల్వేస్టేషన్‌లో కదులుతున్న రైలు ఎక్కే ప్రయత్నంలో హర్షవర్ధన్ (24) అనే కళాశాల విద్యార్థి కాలు జారి పడి మృతిచెందాడు. ఆయన ఆంధ్ర రాష్ట్రం తిరుపతిలో ఉన్న నటుడు మోహన్‌బాబు నిర్వహించే కళాశాలలో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతున్నట్లు తెలిసింది. ఈ రెండు ప్రమాదాలపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

13నుంచి శశికళ పర్యటన



చెన్నై, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, దివంగత జయలలిత సన్నిహితురాలు శశికళ ఈ నెల 13 నుంచి తిరునెల్వేలి జిల్లాలో పర్యటించనున్నట్టు ప్రకటించారు. 13న తిరునెల్వేలి, 14న పాళయంకోట, 16న నాంగునేరి, 17న అంబాసముద్రం, 18న రాధాపురం శాసనసభ నియోజకవర్గాల్లో సభల్లో పాల్గొని ఆమె ప్రసంగించనున్నారు.

కళ్లకుర్చి కేసులో 11 మందికి సమన్లు

అడయార్, ఆగస్టు 10: కళ్లకుర్చి జిల్లాలో జూన్‌లో జరిగిన కల్తీసారా ఘటనకు సంబంధించిన ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ ఎదుట విచారణకు హాజరుకాని 11 మందికి మళ్లీ సమన్లు జారీ చేశారు. కల్తీ సారా తాగి 68 మంది ప్రాణాలు కోల్పోగా, 229 మంది అస్వస్థతకు లోనైన విషయం విదితమే. ఈ ఘటనపై సమగ్ర విచారణకు ప్రభుత్వం మాజీ న్యాయమూర్తి గోకుల్‌దాస్ సారథ్యంలో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ కళ్లకుర్చి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 2వ తేదీ నుంచి వివిధ వర్గాలకు చెందిన వారితో విచారణ జరిపింది. అయితే, వివిధ కారణాలను చూపించి 11 మంది విచారణకు హాజరుకాలేదు. వీరందరూ విచారణకు హాజరుకావాలని మళ్లీ నోటీసులు జారీ చేశారు.

గంజాయి స్మగ్లింగ్... కానిస్టేబుల్ సహా ఇద్దరి అరెస్టు

● 117 కిలోల గంజాయి స్వాధీనం

అడయార్, ఆగస్టు 10: తంజావూరు జిల్లాలోని ఆదిరాంపట్టణంలో స్థానిక పోలీసులు శుక్రవారం రాత్రి నిర్వహించిన వాహన తనిఖీల్లో కారులో తరలిస్తున్న 117 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ స్మగ్లింగ్‌లో కానిస్టేబుల్ సహా ఇద్దరిని అరెస్టు చేశారు. వీరిని పుదుక్కోటకు చెందిన శంకర రాజా పాండ్యన్, తవమణిగా గుర్తించారు. వీరిని విచారించగా ఆంధ్రాకు చెందిన ఓ వ్యాపారి ద్వారా గంజాయిని కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్టు పేర్కొన్నారు. అరెస్టు చేసిన శంకర రాజా పాండ్యన్ తిరుచ్చి, తిరువెరుంబూరు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తుండటం గమనార్హం. వీరిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.





పక్షులకు ఆహారం అందిస్తున్న పిల్లలు



తిరుపత్తూర్ జిల్లా ఏలగిరి కొండలు... ఊటీ, కొడైకెనాల్ లాంటి ప్రముఖ పర్యాటక ప్రాంతం కాకపోయినా, అభివృద్ధి చెందుతున్న పర్యాటకంగా చెప్పుకోవచ్చు. ఈ పర్యాటక ప్రాంతం ప్లస్ పాయింట్ ఏమిటంటే, తక్కువ ధరలకు బసచేసేందుకు విడిది గృహాలు లభిస్తాయి. ఇతర పర్యాటక ప్రాంతాల వలే పర్యాటకుల సంఖ్య కూడా అధికంగా ఉండదు. వాహన రద్దీ కూడా తక్కువే. అందువల్ల ప్రశాంతంగా ఈ ప్రాంతాన్ని వీక్షించవచ్చు. ఈ ప్రాంతంలో అడ్వెంచర్ పార్కులు కూడా ఉన్నాయి.

- పెరంబూర్



పార్కులోని విదేశీ పక్షులు


SUNDAY SPECIAL

పండోరా బర్డ్స్ పార్కు

చూసొద్దామా

బర్డ్స్ పార్కు...

ఏలగిరికి వచ్చే పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది పండోరా పక్షుల పార్కు. పక్షి ప్రేమికులు, ప్రకృతి ప్రేమించే వారికి ఈ పార్కు నచ్చుతుంది. 300లకు పైగా దేశ, విదేశీ పక్షులు బహిరంగ ప్రదేశాల్లో సంచరిస్తుంటాయి. మక్కావ్ చిలుక నుంచి నిప్పు కోడి వరకు పలు రకాల పక్షులున్నాయి. ఈ పక్షులు మనుషులతో సఖ్యతగా నడుచుకుంటాయి. అందువల్లే పర్యాటకులు నేరుగా వీటికి పండ్లు అందించవచ్చు. పర్యాటకులు అందించే ఆహారం కోసం అవి వారి వద్దకు వస్తుంటాయి. అందువల్ల పిల్లలు, మహిళలు పక్షులకు ఆహారం అందించేందుకు ఆసక్తి చూపుతుంటారు. పక్షులతో పాటు కుందేళ్లు, ఉడుములు సహా పలు రకాల చిన్న రకం జంతువులు కూడా చూడవచ్చు.



అక్వేరియం

అక్వేరియం...

ఇది ఒక ప్రైవేటు పార్కు. ప్రవేశ రుసుము కొంత అధికమైనా, లోపలికి వెళ్లి చూస్తే పొందే అనుభూతి అంతా ఇంతా కాదు. గాజు మార్గంలో నడుస్తూ చుట్టూ నీళ్లలో చేపలు, పలు రకాల సముద్రపు జీవులు సంచరించే దృశ్యాలు చూడడం మరో కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. ఏలగిరి బస్టాండ్ నుంచి 4 కి.మీ దూరంలో ఈ అక్వేరియం ఉంది. అక్కడకు వెళ్లాలంటే బస్సు వసతి లేదు. అద్దె, సొంత వాహనాల్లో వెళ్లవచ్చు.

నాకు రెడ్ కార్డా?

● నిర్మాతల మండలికి విశాల్ లేఖ



తనకు తమిళ చలనచిత్ర నిర్మాతల మండలి పరోక్షంగా రెడ్‌కార్డ్ చూపిస్తుందా? అంటూ హీరో విశాల్ ప్రశ్నించారు. తనపై నిర్మాతల మండలి చేసిన పలు ఆరోపణలు, నిధుల దుర్వినియోగంపై వివరణ కోరుతూ నిర్మాతల మండలికి ఆయన శనివారం లేఖ రాశారు. గత నెల 26న నిర్మాతల మండలి లేఖ విడుదల చేసింది. అందులో నిర్మాతల మండలి అధ్యక్షుడిగా విశాల్ ఉన్న సమయంలో రూ.12 కోట్ల మేరకు నిధుల దుర్వినియోగం జరిగినట్టు ప్రత్యేక ఆడిటర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా చేసుకుని, భవిష్యత్తులో విశాల్‌తో సినిమాలు తీయాలని భావించే వారు ముందుగా నిర్మాతల మండలితో చర్చించాలని కోరింది. దీనిపై విశాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను నిర్మాతల సంఘం అధ్యక్షుడిగా ఉన్న సమయంలో నిర్మాతల మండలి ఇన్‌చార్జ్‌గా ఉన్న నిర్మాత కదిరేశన్, ఇతర కార్యవర్గ సభ్యుల అనుమతితో నిధులను సంక్షేమానికి ఖర్చు చేశామన్నారు. ఆ నిధులు కూడా లబ్ధిదారుల ఖాతాలకే నేరుగా బదిలీ చేశామన్నారు. కానీ, నాతో సినిమాలు తీసేవారు నిర్మాతల మండలితో చర్చించిన తర్వాతనే నిర్ణయం తీసుకోవాలని చెప్పడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటి? నాతో సినిమాలు తీసే నిర్మాతలు, నాతో కలిసి పనిచేసే టెక్నీషియన్లు నిర్మాతల మండలితో ఎందుకు చర్చించాలి. విశాల్ అనే నటుడికి నిర్మాతల సంఘం పరోక్షంగా రెడ్ కార్డ్ చూపిస్తుందా? అని తన ప్రకటనలో ప్రశ్నించారు.

చిన్న చిత్రాల విజయమే కోలీవుడ్‌కు ప్రాణం

● గుహన్

చిన్న చిత్రాల విజయమే తమిళ చిత్రపరిశ్రమకు ప్రాణం అని ప్రముఖ నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్ డిస్ట్రిబ్యూషన్ హెడ్ గుహన్ అన్నారు. వెయిలోన్ ఎంటర్‌టైన్మెంట్ సమర్పణలో గోకుల్ బినాయ్, వెరూస్ ప్రొడక్షన్స్ పతాకాలపై ముజీఫ్ నిర్మాణంలో డెబ్యూ డైరెక్టర్ రామచంద్రన్ బి కథను సమకూర్చి దర్శకత్వం వహించిన చిత్రం 'పేచ్చి'. ఈనెల 2న విడుదలైంది. ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించడంతో ఇప్పటికీ విజయవంతంగా ప్రదర్శితమవుతుంది. దీంతో చిత్ర విజయోత్సవాలను శుక్రవారం చెన్నైలో నిర్వహించారు. ఈ సందర్భంగా గుహన్ మాట్లాడుతూ... 'ఈ సినిమా తమిళనాడు సరిహద్దులను దాటి కర్ణాటక రాష్ట్రంలో కూడా విశేష ఆదరణ లభించడం సంతోషంగా ఉంది. కమర్షియల్ పరంగా హిట్ సాధించింది. తమిళ చిత్ర పరిశ్రమకు చిన్న సినిమాల సక్సెస్ ఊపిరి వంటిది. 'పేచ్చి' తరహా సినిమాలు నిర్మించినపుడే చిత్ర పరిశ్రమ మనుగడ సాగించగలదు' అని తెలిపారు. నిర్మాత ముజీఫ్ మాట్లాడుతూ... 'మీడియా ఇచ్చిన పాజిటివ్ రివ్యూల కారణంగా ఈ సక్సెస్‌కు కారణం. కంటెంట్ బాగుంటే జర్నలిస్టులు కూడా రివ్యూలు పాజిటివ్‌గానే రాస్తారని అర్థం చేసుకున్నా. ఈ విజయం వెనుక ఉన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. దర్శకుడు రామచంద్రన్ మాట్లాడుతూ... 'ఒక చిత్రానికి, డెబ్యూ డైరెక్టర్‌కి న్యాయనిర్ణేతలు పాత్రికేయులే. వారిచ్చే తీర్పుపైనే ఆ సినిమా సక్సెస్, డెబ్యూ డైరెక్టర్ కెరీర్ ఆధారపడి ఉంటుంది. ఈ సినిమాను చూసిన పలువురు పాత్రికేయులు భుజంతట్టి అభినందించారు. అపుడే నాకు ధైర్యం వచ్చింది. సినిమా ఇంత హిట్ కావడానికి మీడియానే కారణం' అని పేర్కొన్నారు. అలాగే, నిర్మాత బినాయ్, నటుడు బాలశరవణన్ తదితరులు ప్రసంగించారు.



సక్సెస్ వేడుకలో 'పేచ్చి' చిత్ర యూనిట్ సభ్యులు



'ల్ ద గా సై ఆ' సదా నాడార్, మోనికా సెలీనా

విష్ణు విశాల్ సమర్పణలో 'హాట్‌స్పాట్' సీక్వెల్

చిత్రజ్యోతి

సమాజంలోని నాలుగు వేర్వేరు అంశాలతో హైపర్ లింక్ సోషియో డ్రామా మూవీగా తెరకెక్కి ఈ యేడాది విడుదలై ప్రేక్షకాదరణ పొందిన చిత్రం 'హాట్‌స్పాట్'కు రెండో భాగం రానుంది. విష్ణువిశాల్ స్టూడియోస్ పతాకంపై హీరో విష్ణువిశాల్ సమర్పణలో కేపీబీ టాకీస్, సెవెన్ వారియర్స్ నిర్మాణంలో నిర్మాత కేవీ దురై పర్యవేక్షణలో ఈ సినిమా రూపుదిద్దుకోనుంది. ఈ విషయాన్ని శుక్రవారం రాత్రి చెన్నైలో జరిగిన విలేకరుల సమావేశంలో అధికారికంగా వెల్లడించారు. ఇందులో విష్ణువిశాల్ మాట్లాడుతూ... 'హట్‌స్పాట్ తొలి భాగాన్ని ఓటీటీలో చూశా. ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి వచ్చి పాజిటివ్ రెస్పాన్స్ చూసి ఆశ్చర్యపోయా. నేను లేకుంటే ఈ సినిమాకు సీక్వెల్ వచ్చేది కాదని చాలా మంది అంటున్నారు. ఆ వ్యాఖ్యలతో ఏకీభవించను. మంచి చిత్రం ఏదో రూపంలో వచ్చి తీరుతుంది. అలా ఈ రెండో భాగానికి శ్రీకారం చుట్టాం. నా 15 యేళ్ల సినీ అనుభవంలో మంచి కథలను ఎంపిక చేసుకోనుకోవడం నేర్చుకున్నా. నిర్మాతగా మారా. విష్ణు విశాల్ స్టూడియో భవిష్యత్తులో మంచి సినిమాలను నిర్మిస్తుంది' అని పేర్కొన్నారు. దర్శకుడు విఘ్నేష్ కార్తీక్ మాట్లాడుతూ... 'హాట్‌స్పాట్‌కు ప్రేక్షకుల స్పందన కంటే మీడియాలో వచ్చిన రివ్యూలు బలంగా నిలిచాయి. ఇప్పుడు రెండో భాగానికి శ్రీకారం చుట్టాం. విష్ణు విశాల్ చేతులు కలపడం సంతోషంగా ఉంది. రెండో భాగం కూడా మొదటి భాగంలానే ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది' అని పేర్కొన్నారు.



మీడియా సమావేశంలో విష్ణువిశాల్, విఘ్నేష్ కార్తీక్ తదితరులు

భార్యాభర్తలు నటించిన 'ల్ ద గా సై ఆ'

నిజ జీవితంలో ప్రేమించుకుని పెళ్లి చేసుకుని భార్యాభర్తలుగా ఉన్న సదా నాడార్, మోనికా సెలీనా జంటగా నటించిన రొమాంటిక్ కథా చిత్రం 'ల్ ద గా సై ఆ'. ఈరోడ్ జిల్లాకు చెందిన ఈ ప్రేమ దంపతులు.. హీరోహీరోయిన్లుగా నటించడమే కాకుండా, స్వయంగా దర్శకత్వం కూడా వహించారు. తమిళ చిత్రపరిశ్రమలో నిజజీవితంలో భార్యాభర్తలైన ఒక జంట ఓ సినిమాలో హీరోహీరోయిన్లుగా నటించి, దర్శకత్వం వహించడం ఇదే తొలిసారి. ఈ ప్రాజెక్టు వివరాలను సదా నాడార్, మోనికా సెలీనా వివరిస్తూ, 'సినిమాల ద్వారా సమాజానికి ఏదైనా చేయాలని భావించాం. దీనికంటే ముందుగా ఒక ప్రివ్యూ తరహాలో ఒక సినిమాను నిర్మించాలని నిర్ణయం తీసుకున్నాం. ఇందులో నేను, నా భార్య హీరోహీరోయిన్లుగా నటించాం. ఒక కుటుంబంలో ప్రేమించే భార్య ఉన్న వ్యక్తి ఒక సమస్యను ఏ విధంగా ఎదుర్కొంటాడన్న కథాంశాన్ని చక్కటి స్క్రీన్‌ప్లేతో రూపొందించాం. ఊటీ, ఈరోడ్, చెన్నై, కోయంబత్తూరు, ఏర్కాడ్, పుదుచ్చేరి, ఈసీఆర్, గోవా తదితర అందమైన లొకేషన్లలో చిత్రీకరించాం. కుటుంబ సమేతంగా చూసేలా తెరకెక్కించాం. మేం ఎవరివద్దా పనిచేయలేదు. సినిమాలు చూసి ఎన్నో విషయాలు నేర్చుకున్నాం. ఆ అనుభవంతోనే ఈ సినిమాను నిర్మించాం. కపిల్ క్రియేషన్స్ పతాకంపై నిర్మితమైన ఈ చిత్రంలో నటించిన, పని చేసిన వారంతా కొత్తవారే. త్వరలోనే విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. సంగీతం ఈజే జాన్సన్ అందించారు' అని పేర్కొన్నారు.

ముమ్మరంగా చెంగల్పట్టు రైల్వేస్టేషన్ పునరుద్ధరణ

పెరంబూర్, ఆగస్టు 10: చెంగల్పట్టు రైల్వేస్టేషన్ పునరుద్ధరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నగర శివారు ప్రాంతమైన తాంబరం తర్వాత చెంగల్పట్టు ప్రధాన రైల్వేస్టేషన్. చెన్నై బీచ్ నుంచి చెంగల్పట్టు వరకు సబర్బన్ రైళ్లు నడుస్తుండగా, దక్షిణ ప్రాంతాలకు వెళ్లే పలు రైళ్లు ఈ రైల్వేస్టేషన్ మీదుగానే రాకపోకలు సాగిస్తున్నాయి. ఆంధ్ర, తెలంగాణ నుంచి రాష్ట్రంలోని దక్షిణాది జిల్లాలకు వెళ్లే రైళ్లు కూడా ఆ మార్గంలోనే వెళుతుండగా, హైదరాబాద్ నుంచి చెన్నై సెంట్రల్ వచ్చే చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలును కూడా చెంగల్పట్టు వరకు పొడిగించారు. ఈ స్టేషన్ ప్రాముఖ్యత గుర్తించిన రైల్వే శాఖ 'అమృత్ భారత్ స్టేషన్ స్కీం (ఏబీబీఎస్) పథకంలో చేర్చింది. ప్రస్తుతం రూ.22.14 కోట్లతో జరుగుతున్న పునరుద్ధరణ పనులు అక్టోబరు 31వ తేది నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.

చేపట్టిన పనులు ఇవీ...

- కొత్త స్టేషన్ భవన నిర్మాణం ● ఆర్చితో కూడిన ప్రవేశ ద్వారం
- కొత్త బుకింగ్ కౌంటర్లు, అదనంగా మూడు రిటైరింగ్ గదులు
- ఏసీ వెయిటింగ్ హాల్, వీఐపీ లాంజ్ ● ప్లాట్‌ఫాంపై అందమైన ఫ్లోరింగ్
- పాదచారుల మార్గాల అభివృద్ధి
- ఫుట్ ఓవర్ బ్రిడ్జికి వెళ్లేలా రెండు లిఫ్టులు, ఎస్కలేటర్ ఏర్పాటు
- మెరుగైన పబ్లిక్ అనౌన్స్‌మెంట్ ● రైళ్ల రాకపోకలు తెలిపేలా డిజిటల్ బోర్డులు
- రూఫింగ్ షీట్లతో కూడిన పైకప్పు ● భద్రత కోసం సీసీ కెమెరాలు



రైల్వేస్టేషన్ ప్రవేశ ద్వారం నమూనా - బుకింగ్ కౌంటర్ గదుల నిర్మాణం - పాదచారులకు కాలిబాట ఏర్పాటు పనులు - లిఫ్టుల నిర్మాణం



వయనాడ్ సహాయక చర్యల కోసం 'కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధి'కి రూ.కోటి విరాళం చెక్కును ముఖ్యమంత్రి పినరాయ్ విజయన్‌కు చెన్నై ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ తరపున అందజేస్తున్న నటీమణులు సుహాసిని, ఖుష్బూ, మీనా, లిజి తదితరులు

కోనేటంపేటలో ఎస్పీబీకి విగ్రహావిష్కరణ

అడయార్, ఆగస్టు 10: ప్రముఖ సినీ నేపథ్యగాయకుడు దివంగత ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం స్వగ్రామంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఇందులో ఆయన సతీమణి సావిత్రి, సోదరి, సినీ నేపథ్యగాయని ఎస్పీ శైలజ, ఆమె భర్త, సినీ నటుడు శుభలేఖ సుధాకర్, బంధువు భానుమూర్తి, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అలాగే, గ్రామస్తులు కూడా పాల్గొని తమ అభిమాన గాయకుడికి నివాళి అర్పించారు. కాగా, తిరువళ్ళూరు జిల్లాలోని పళ్ళిపట్టు సమీపంలో కోనేటంపేట ఉంది. ఇది ఎస్పీబీ కుటుంబీకుల స్వగ్రామం. ఆ గ్రామంలోని కుటుంబ సభ్యులతో ఎస్పీబీ తన బాల్యాన్ని గడిపారు. దీంతో ఆయన స్మారకార్థం గ్రామంలో ఎస్పీబీ విగ్రహాన్ని కుటుంబ సభ్యులు ఏర్పాటు చేశారు. నాలుగు అడుగుల ఎత్తున్న ఆ విగ్రహాన్ని కుటుంబ సభ్యులే ఆవిష్కరించారు.



ఎస్పీబీ విగ్రహావిష్కరణలో కుటుంబ సభ్యులు

టి.నగర్‌లో నెయిల్ స్టేషన్ ప్రారంభం

అడయార్, ఆగస్టు 10: స్థానిక టి.నగర్‌లోని శివప్రకాశం వీధిలో ఉన్న నెయిల్ స్టేషన్‌ను ప్రముఖ మహిళా వ్యాపారవేత్త సుమ హారిస్‌తో కలిసి వ్యవస్థాపకురాలు అనురాధ గౌతమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అనురాధ గౌతమ్ మాట్లాడుతూ... గత 18 యేళ్లుగా ఈ రంగంలో కొనసాగుతున్నామన్నారు. అనేక మంది మహిళలు తమ చేతులను మరింత అందంగా ఉంచుకునేందుకు ఇష్టపడుతూ స్టూడియోలకు వెళుతున్నారని తెలిపారు. అలాగే, గౌరవ అతిథి సుమ మాట్లాడుతూ, కస్టమర్ల పట్ల ఎంతో గౌరవ మర్యాదలతో నడుచుకుంటూ, వారికి అవసరమైన సేవలు అందిస్తున్నారని తెలిపారు. యువతులు అందంగా ఉండేలా తమను తాము సింగారించుకోవడం పట్ల ఎక్కువ శ్రద్ధ చూపుతారని తెలిపారు. ఇపుడు చేతి వేళ్ల గోళ్ళను పొడవుగా పెంచుకుంటూ వాటిని సంసరక్షించుకునేందుకు అధిక ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. అలాంటి వారికి ఈ నెయిల్ స్టేషన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.



అనురాధ గౌతమ్ - సుమ హారిస్

నాగై - శ్రీలంక మధ్య నౌకాయానం

● ట్రయల్ రన్ ప్రారంభం



చెన్నై, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినం - శ్రీలంక కాంగేశన్ రేవు మధ్య మళ్లీ నౌకాయానం ప్రారంభం కానుంది. ఈ మేరకు శనివారం ఆ రెండు ప్రాంతాల నడుమ నౌకతో ట్రయల్ రన్ నిర్వహించారు. నౌకాయానం ప్రారంభించేందుకు అండమాన్ నుంచి 'శివగంగై' అనే నౌక చెన్నై మీదుగా నాగపట్టినం రేవుకు ఈ నెల 6వ తేదీన చేరింది. ఆ తర్వాత నాగపట్టినం రేవు నుంచి శ్రీలంక కాంగేశన్ రేవుకు మధ్య నౌకాయానం ఈ నెల 15 తర్వాత ప్రారంభించేందుకు అధికారులు తగు సన్నాహాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో నాగపట్టినం ఓడరేవు నుండి శనివారం ఉదయం 8గంటలకు 'శివగంగై' నౌక ట్రయల్ రన్ నిర్వహించారు. ఆ నౌక మధ్యాహ్నం 12 గంటలకు కాంగేశన్ రేవుకు చేరింది. ఆ తర్వాత అక్కడి నుంచి బయలుదేరిన ఆ నౌక సాయంత్రం 4 గంటలకు నాగపట్టినం ఓడరేవుకు చేరింది. గతేడాది ప్రారంభమైన ఈ నౌకాయాన సేవలు అర్థంతరంగా ఆగిపోయాయి. మళ్లీ ఈ నౌకాయానం ప్రారంభం కానుండటంతో రెండు దేశాల వ్యాపారులు, పర్యాటకులు లబ్ధి పొందనున్నారు. ఈ 'శివగంగై' నౌకలో ఆర్డినరీ కేటగిరిలో 133 సీట్లున్నాయి. ఈ కేటగిరిలో ఒకరికి రూ.5వేలను ఛార్జీగా వసూలు చేస్తారు. ఇదే విధంగా ప్రీమియం విభాగంలో 27 సీట్లున్నాయి. అందులో ప్రయాణించడానికి రూ.7500 ఛార్జీగా వసూలు చేస్తారు. ఈ నౌకలో ప్రయాణించేవారు తమ వెంట 60 కిలోల బరువు లగేజీని తీసుకెళ్లటానికి అనుమతిస్తారు. ఇతర వివరాలకు, టికెట్లు బుక్ చేసుకోవడానికి sailindsri.com లో సందర్శించాలని ఆ నౌకాయాన సంస్థ నిర్వాహకులు పేర్కొన్నారు.

అలరించిన అంతర్ పాఠశాలల

సంప్రదాయ, సాంస్కృతిక పోటీలు

ప్యారీస్, ఆగస్టు 10: నగరంలోని ఎస్కేపీడీ చారిటీస్ నిర్వహిస్తున్న మహర్షి విద్యా మందిర్ సీనియర్ సెకండరీ పాఠశాలలో అంతర్ పాఠశాలల సంప్రదాయ సాంస్కృతిక పోటీలు అలరించాయి. పారంపర్యం 2024-25 పేరుతో శుక్ర, శనివారాల్లో నిర్వహించిన అంతర్ నిహిత ప్రతిభ పోటీల్లో చెన్నైలోని 25 పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నృత్యం, పెయింటింగ్, యాడ్ జాబ్, డిబేట్ తదితర పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిన డీఏవీ పాఠశాల రోలింగ్ ట్రోఫీ దక్కించుకుంది. ప్రమ్ అకాడమీ ద్వితీయ, కోలా సరస్వతి పాఠశాల తృతీయ బహుమతులు అందుకున్నాయి. శనివారం సాయంత్రం చూలైలోని పాఠశాల ప్రాంగణంలో జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి గౌరవ కరస్పాండెంట్ టీవీ రామకుమార్ అధ్యక్షత వహించగా, ఎస్కేపీడీ పాలక మండలి సభ్యులు ఊటుకూరు శరత్‌కుమార్, దేసు లక్ష్మీనారాయణ, ఎస్ఎల్ సుదర్శనం, కిషోర్ బాబు, బద్రీనాథ్ పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన, ప్రార్థనా గీతం అనంతరం ప్రిన్సిపాల్ టి.సుబ్రమణ్యం ఆహ్వానం పలకగా, ముఖ్య అతిథిగా ప్రముఖ నేపథ్యగాయని స్మృతి శేఖర్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న పాఠశాలలకు ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో భాగంగా మహర్షి విద్యామందిర్ విద్యార్థినులు రూపొందించిన కళాకృతుల ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. వైస్ ప్రిన్సిపాల్ ఎం.కవిత, మేనేజర్ శ్రీలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్న ఈ కార్యక్రమం సీనియర్ టీచర్ ఉషారాణి వందన సమర్పణతో ముగిసింది.



రోలింగ్ షీల్డుతో డీఏవీ పాఠశాల విద్యార్థులు